క్లుప్తంగా

పక్కాగా ఓటరు జాబితా సవరణ



పానాటూరులో ఓటర్ల సర్వే చేస్తున్న బీఎల్‌ఓలు

గుడిపాల: ఓటర్ల జాబితా సవరణను పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ బాబూరాజేంద్ర ప్రసాద్ బూత్ లెవల్ అధికారులకు సూచించారు.నారగల్లు, పానాటూరు పంచాయతీల్లో జరుగుతున్న ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఓటర్ల నుంచి అభ్యంతరాలు, మార్పు, చేర్పుల వివరాలను సేకరించాలని చెప్పారు. ఏదైనా సందేహాలుంటే సంబంధిత అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని సిబ్బందికి సూచించారు.

వర్షాకాలం.. అప్రమత్తత అవసరం

చిత్తూరు కార్పొరేషన్: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. వర్షానికి తడిసిన కరెంటు స్తంభాలను, తీగలకు తగులుతున్న చెట్లు, కొమ్మలు తాకరాదని సూచించారు. పార్కు, స్టేడియంలోని విద్యుత్ స్తంభాలు, నివాసాల్లోని స్విచ్‌బోర్డులు, లైట్లును తడిచేతితో ముట్టుకోరాదని చెప్పారు. ఇనుప తీగలపై దుస్తులు ఆరవేసేటపుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాటర్ హీటర్‌ను స్విచ్ ఆఫ్ చేసిన తర్వాత నీళ్ల నుంచి బయటకు తీయాలన్నారు. ఉరుములు, మెరుపుల సమయంలో టీవీ, ఫ్రిజ్, కంప్యూటర్ స్విచ్‌లు ఆఫ్ చేసి, డిష్ కనెక్షన్ తొలగించాలని చెప్పారు. విద్యుత్ లైన్ కింద సెల్ ఫోన్ మాట్లాడరాదని, నివాసాలకు వచ్చే సర్వీసు వైర్ దెబ్బతింటే స్థానిక విద్యుత్ సిబ్బందికి వెంటనే తెలియజేయాలని వివరించారు.

197 రామాపురంలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ రష్మిత అన్నారు. 197 రామాపురంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దివ్య, శిల్ప, శాంతకుమారి, సరస్వతి, అనురాధ, శశికళ పాల్గొన్నారు.

తప్పుడు కేసుపై ఫిర్యాదు

చిత్తూరు అర్బన్: తనపై వెదురుకుప్పం పోలీస్ స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టినట్లు చిత్తూరుకు చెందిన న్యాయవాది జయకుమార్ ఆరోపించారు. ఆయన బుధవారం న్యాయవాదులు, బీజేపీ నాయకులతో కలిసి చిత్తూరులో ఎస్పీ రిశాంత్‌రెడ్డిను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈనెల 22వ తేదీ చిత్తూరులోని జేసీ కోర్టులో తాను విధుల్లో ఉంటే, అదేరోజు వెదురుకుప్పంలో ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించినట్లు తప్పుడు కేసు నమోదైందని, దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదుపై విచారణ చేయిస్తామని ఎస్పీ తెలిపారు.

కంతులు వాయిదా వేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : పెన్షనర్ల ఆదాయపుపన్ను వసూలు కంతులు వాయిదా వేయాలని జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశవులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పన్ను చెల్లించే పెన్షన్‌దారులు పాత ఇన్‌కంటాక్స్, కొత్త ఇన్‌కంటాక్స్ పద్ధతిలో కొనసాగుతారా అనే అంశంపై డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. జూలైలో ఇన్‌కంట్యాక్స్ కంతులు పెన్షన్‌లో రికవరీ చేస్తామని అధికారులు తెలిపారని, అయితే ఆగస్టు నెల పెన్షన్‌లో ట్యాక్స్ కంతులను మినహాయించుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం



విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్ట్‌కు హైదరాబాద్‌లోని నేతాజీ నగర్‌కు చెందిన శ్రీనివాస కుమార్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందించారు. దాత కుటుంబ సభ్యులు బుధవారం ఆలయానికి విచ్చేయగా, వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో తెలంగాణ ఎమ్మెల్యే

తెలంగాణలోని కూకట్‌పల్లె ఎమ్మెల్యే మాధవరావు, టీటీడీ బోర్డు సభ్యులు మురంశెట్టి రాములు ఉదయం విచ్చేయగా, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు అందించారు.

ఆరుతడి.. కాసులు దండి



చిత్తూరు మండలంలో సాగు చేస్తున్న మిరపపంట

ప్రస్తుత సీజన్‌లో అనూహ్యంగా కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ఏ కూరగాయ తీసుకున్నా కిలో రూ.వంద పలుకుతోంది. దీంతో ఆరుతడి పంటలు సాగు చేసిన రైతుల ఇంట కాసుల వర్షం కురుస్తోంది. ఇప్పటికే టమాటా సాగు చేసిన రైతులు లాభాల బాట పట్టారు. ఈ క్రమంలోనే అన్నదాతలు ఆరుతడి పంటల వైపు దృష్టి మళ్లించారు. ప్రధానంగా కూరగాయల సాగుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే చాలా మంది రైతులు దుక్కులు దున్ని కూరగాయల పంటలను సాగులోకి తీసుకొస్తున్నారు.

- కూరగాయల ధరలకు రెక్కలు
- సాగుకు శ్రీకారం చుట్టిన రైతులు
- కూలీలకు డిమాండ్ ఎక్కువ

చిత్తూరు రూరల్: నియోజకవర్గంలో మామిడి సాగు అధిక విస్తీర్ణంలో ఉంది. తర్వాత చెరకు, వేరుశనగ, వరి వంటి వాణిజ్య రకాల పంటలు అదును బట్టి సాగు చేస్తున్నారు. అప్పుడప్పుడు ఆరుతడి పంటలుగా కొంత మంది రైతులు కూరగాయలు సాగు చేస్తారు. ఇవి తక్కువ కాల వ్యవధిలో రైతులకు ఆదాయం సమకూరుస్తాయి. ప్రస్తుత సీజన్‌లో బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు 70 నుంచి 80 ఎకరాల్లో మాత్రమే ఆకుకూరలు, బెండ, వంగ, టమాట, మిరప వంటివి పండించుకుంటున్నారు. ఈ పండిన పంటలను ఇంటి అవసరాలకు పోగా మిగిలినవి గ్రామాల్లో, సంతల్లో విక్రయిస్తుంటారు. అధిక విస్తీర్ణంలో పండించిన రైతులు మాత్రం చిత్తూరు మార్కెట్లో అమ్మకానికి పెడుతుంటారు. అయితే ప్రస్తుత కూరగాయల ధరలతో ఒక్కసారిగా రైతుల్లో మార్పు కనిపిస్తోంది.

ఊరిస్తున్న కూరగాయల ధరలు

పెద్ద రైతుల నుంచి చిన్న రైతుల వరకు కూరగాయల ధరలు ఊరిస్తున్నాయి. ఇటీవల ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాల దెబ్బకు పంటలు నష్టపోయి, కూరగాయల సరఫరా నిలిచిపోయింది. కర్ణాటక నుంచి కూడా కూరగాయల రవాణా అంతంత మాత్రంగానే ఉంది. ఈ ఫలితంగా ఏ కూరగాయ అయినా కిలో వంద రూపాయలు పలుకుతోంది. ప్రధానంగా టమాట కిలో ధర రూ.100 దాటేసింది. అల్లం రూ.300 పైమాటే. ఇదే దారిలో పచ్చిమిరప, బీన్స్, వంగ, చిక్కుడు కూడా నిలుస్తోంది. చాలా చోట్ల టమాట సాగు చేసిన రైతులకు రూ.లక్షలు, రూ.కోట్లల్లో ఆదాయం గడిస్తున్నారు. ఈ ఫలితాలు మిగిలిన రైతులను కదిలిస్తున్నాయి. కూరగాయల సాగు వైపు మళ్లిస్తున్నాయి.

కూలీలకు డిమాండ్

నియోజకవర్గ వ్యాప్తంగా వ్యవసాయ కూలీలు దొరకని పరిస్థితి. ఇన్నాళ్లు మామిడి కోతల్లో కూలీలకు మంచి డిమాండ్. వేకువజామునే కూలీల కోసం రైతులు గ్రామాల్లో క్యూకట్టేవారు. రోజుకూ ఒక్కొక్కరికి రూ.1,000 నుంచి రూ.1,500 వరకు గిట్టుబాటు అయింది. మళ్లీ కూరగాయల సాగు ప్రారంభం కావడంతో రైతులకు కూలీలను వెతుక్కోవాల్సి వస్తోంది. మంచి గిరాకీ వచ్చి పండింది. ఇలా కూరగాయల ధరలు పెరుగుదలతో ఇటూ రైతులు బిజీబిజీగా..అటూ కూలీలకు చేతినిండా పని దొరుకుతోంది.

మండలంలో విరివిగా నాట్లు

గత నాలుగేళ్ల నుంచి సంవృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. పంటల సాగుకు బోరుబావులు, చెరువుల్లో నీటి వసతి పుష్కలంగా ఉంది. కానీ నియోజకవర్గంలో కూరగాయల సాగు కొంత మంది రైతులు మాత్రమే చేస్తారు. ఖరీఫ్ సీజన్ అంటే వేరుశనగతోపాటు వరినాట్లపైనే దృష్టి ఉంటుంది. అదునుబట్టి కొద్దిపాటిగా మిరపనాట్లు వేస్తారు. అదే స్థాయిలో టమాటను సాగులోకి తెస్తుంటారు. ప్రస్తుత రోజుల్లో కూరగాయల ధరలు రూ.వందల్లో పలుకుతున్నాయి. దీంతో రైతులంతా కూరగాయల సాగుకు దుక్కులు చేస్తున్నారు. మరికొంత మంది నాట్లు వేశారు. ఎక్కువగా వంగ, బెండ, టమాట, ఆకు కూరలు, మిరప నాటుకుంటున్నారు. దీంతో కూరగాయల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. కురుస్తున్న వర్షాలు ఆగిపోయిన తరువాత మరింత మంది కూరగాయల సాగుకు సిద్ధమవుతారు.

రెండు మూడు రకాలు నాటుకోవాలి

ప్రస్తుతం డిమాండ్‌కు తగ్గట్టు కూరగాయల ఉత్పత్తి లేదు. ఈ నేపథ్యంలో కూరగాయల ధరలు బాగున్నాయి. ఇప్పుడు ధరలున్నాయని టమాటనే అధికంగా సాగు చేయకూడదు. వేరే రకం కూరగాయలు కూడా పండించుకోవాలి. అప్పుడే నష్టాలను అధిగమించేందుకు అవకాశం ఉంటుంది. పంట సాగులో తొందరపాటు ఉండకూడదు. రైతులు శాఖ అధికారుల, సూచనలు తీసుకోవాలి.

– కోటేశ్వరరావు, ఉద్యానశాఖ అధికారి

పారదర్శక పాలనకు నిదర్శనం



సంక్రాంతిపల్లె సచివాలయంలో సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బాబు

బంగారుపాళెం: పారదర్శక పాలనకు నిదర్శనం జగనన్న ప్రభుత్వమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని సంక్రాంతిపల్లె గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష గ్రామ సభను అధికారులు నిర్వహించారు. గ్రామ సభలో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులందరికీ ఉచితంగా సర్టిఫికెట్లు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా కృషి చేస్తోందన్నారు. గతంలో ఏ సర్టిఫికెట్ పొందాలన్నా ప్రజలు రోజుల తరబడి సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజల వద్దకు పాలన కొనసాగించేందుకు మరో మారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం 11 రకాల ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, స్థానిక సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ జ్యోతీష్‌కుమార్, తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తిమ్మోజుపల్లెలో..

మండలంలోని తిమ్మోజుపల్లె గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఉదయం నిర్వహించే గ్రామ సభకు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలన్నారు.

పాడి రైతులకు ప్రభుత్వం చేయూత



చాఫ్ కట్టర్స్‌ను పంపిణీ చేస్తున్న డాక్టర్ లావణ్య

తవణంపల్లె: ప్రభుత్వం పాడి రైతులకు చేయూతనిస్తోందని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ లావణ్య తెలిపారు. స్థానిక వెటర్నరీ హాస్పిటల్లో బుధవారం పాడి రైతులకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద 53 మంది రైతులకు సబ్సిడీతో గడ్డి కత్తిరించే యంత్రాలను పంపిణీ చేశారు. డాక్టర్ లావణ్య మాట్లాడుతూ గడ్డి కత్తిరించే యంత్రాల(చాఫ్ కట్టర్స్)కు ప్రభుత్వం రూ.13,588 సబ్సిడీ ఇవ్వగా రైతులు రూ.20,382 చెల్లించారన్నారు. 2 హెచ్‌పీ మోటారు, మూడు బ్లేడ్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన పాడి రైతులు చాఫ్ కట్టర్ల కోసం డబ్బులు చెల్లిస్తే ప్రతిపాదనలు పంపుతామన్నారు. మండలంలో 63 మంది రైతులు చాఫ్‌కట్టర్లకు డబ్బులు చెల్లించారని, ప్రస్తుతం 53 మందికి మాత్రం పంపిణీ చేశామన్నారు. మిగిలిన రైతులకు త్వరలో పంపిణీ చేస్తామన్నారు.

పీహెచ్‌సీలో విధిగా ప్రసవాలు చేయించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభావతిదేవి

తవణంపల్లె: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధిగా ప్రసవాలు(డెలివరీలు) చేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీని బుధవారం డీఎంహెచ్‌ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టరు, హాస్పిటల్ రికార్డులను, డెలివరీ రికార్డులను పరిశీలించారు. తర్వాత ల్యాబ్, ఫార్మసీ, ఓపీ గదిని పరిశీలించారు. ఆశావర్కర్ల ద్వారా పీహెచ్‌సీలోనే ప్రసవాలను(కాన్పులు) అధికంగా చేయించాలని డాక్టర్‌ను ఆదేశించారు. వ్యాక్సిన్లు సకాలంలో వేయించి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయించాలని సూచించారు. డీఎంహెచ్‌ఓతోపాటు చిత్తూరు ఎంటమాలజిస్టు డాక్టర్ శ్రీవాణి, తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, సూపర్‌వైజర్ లక్ష్మీపతి, సీహెచ్‌ఓ సుబ్రమణ్యం, పీహెచ్‌ఎన్ భారతి, సూపర్‌వైజర్ హరి, నిర్మలమ్మ, ఎల్‌టి శేఖర్, స్టాఫ్‌నర్స్ శ్రీదేవి పాల్గొన్నారు.

పనులను సద్వినియోగం చేసుకోండి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలో వేపనపల్లిలో బుధవారం ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ పని విధానాలను మెరుగుపరుచుకోవాలని చెప్పారు. వర్షాలు పడుతుండడంతో ఉదయాన్నే పనులకు రావాలని సూచించారు. కూలీల వేతనాలు సక్రమంగా వారి ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు. అనంతరం కూలీల పనితీరును అడిగి తెలుసుకున్నారు. వారంలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సౌభాగ్యవతి పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

ఐరాల: మండలంలోని కాణిపాకం సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దీనికి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరవుతారని చెప్పారు. ఎమ్మెల్యే గడప గడప సందర్శించి, ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడతారన్నారు.

జిల్లాకు 88 పీఎంకేఎస్ కేంద్రాలు

చిత్తూరు కార్పొరేషన్: రైతుల కోసం జిల్లాకు కేంద్ర ప్రభుత్వం 88 పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను మంజూరు చేసిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు తెలిపారు. స్థానిక పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రం వద్ద బుధవారం ఆయన మాట్లాడారు. ఈ కిసాన్ సమృద్ధి కేంద్రాలను ప్రధాని మోదీ గురువారం రాజస్థాన్‌లోని శికార్ ప్రాంతం నుంచి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రాల ద్వారా భూసార పరీక్షలు, పంట తెగుళ్లకు పెస్టిసైడ్స్ అందించడం, సబ్సిడీ ధరల్లో ఎరువుల్ని సరఫరా చేయనున్నట్లు వివరించారు.

మూడో విడతలో మరమ్మతులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పెనుమూరు మండలం సన్యాసిపల్లి, దార్వగానిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో మూడో విడత నాడు–నేడు పనుల్లో మరమ్మతులు చేయనున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆ పాఠశాలల్లో 20 మంది కంటే తక్కువ మంది విద్యార్థులు ఉండడంతో నాడు–నేడు మొదటి, రెండవ దశల్లో ఎంపిక కాలేదన్నారు. మూడవ విడత పనుల జాబితాలో ఆ రెండు పాఠశాలల్లో మరమ్మతులు, ఇతర సౌకర్యాలకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్

ఐరాల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్ సూచించారు. ఆయన బుధవారం స్థానిక పీహెచ్‌సీని సందర్శించి, రికార్డులు, మందులు తనిఖీ చేశారు. ఎల్‌సీడీసీ సర్వేపై ఆరా తీశారు. వెంకటప్రసాద్ మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులను ప్రాథమిక దశలోనే గుర్తించి, వెంటనే చికిత్స అందించాలని సూచించారు. సాధారణ వ్యక్తులు కన్నా హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో విస్తృతంగా క్షయ వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, డాక్టర్ పూర్ణలత పాల్గొన్నారు.

వాహనాల వేలం..రూ.1.48లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

గుడిపాల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం సెబ్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అయేషా బేగం వేలం పాట నిర్వహించారు. మూడు ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలకు వేలం పాట నిర్వహించగా, రూ.1.48 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలియజేశారు. ఈ వాహనాలకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రూ.39,600గా ధర నిర్ణయించారన్నారు. అయితే వాహనాల కొనుగోలుకు పోటీ అధికం కావడంతో వేలం పాటలో రూ.1,08,500 అదనంగా వచ్చిందని వివరించారు. ఆమెతో పాటు సెబ్ సీఐ జోగేంద్ర, గుడిపాల ఎస్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



విజయ్ దివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న లోకేష్

గుడిపాల: విద్యార్థి దశ నుంచి దేశాభిమానం పెంపొందించుకోవాలని సీఎస్ఆర్ కళాశాల కరస్పాండెంట్ లోకేష్ అన్నారు. బుధవారం సీఎస్ఆర్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ వేడకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూలై 26న కార్గిల్ విజయ్ దివస్‌ను దేశమంతా జరుపుకుంటామన్నారు. ప్రిన్సిపల్ రామచంద్ర మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశం పట్ల ప్రేమాభిమానాలను, సౌభ్రాతృత్వ భావాలను కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్, అధ్యాపకులు రీనా, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ ఉద్యోగుల నిరసనలు



ఈఈ పద్మనాభపిళ్లైతో మాట్లాడుతున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు నేటి నుంచి నిరసనలు తెలపనున్నట్లు ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యాక్షన్ కమిటీ డివిజన్ నాయకులు శేషాద్రి, వివేకానందరెడ్డి, యజ్ఞేశ్వరరావు, గోవిందు తెలిపారు. గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయంలో బుధవారం ఈఈ పద్మనాభపిళ్లైతో సమావేశమయ్యారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను దశలవారీగా రెగ్యులర్ చేయాలి, గ్రేడ్–2 జేఎల్ఎంలను శాశ్వత ప్రాతిపదికన తీసుకోవాలి. పీఆర్సీ చెల్లింపులు పాతపద్ధతిలో ఇవ్వాలన్నారు. కారుణ్య నియామకాలను వేగవంతంగా పూర్తి చేయాలి. ఈ డిమాండ్లతో ఈనెల 27, 28న నలబ్యాడ్జీలతో ధరించి భోజన సమయంలో నిరసన ప్రదర్శన చేపట్టనున్నమన్నారు. 31న స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలకు వినతిపత్రాల సమర్పణ, ఆగస్టు 1న సర్కిల్, జిల్లా కేంద్ర కార్యాలయాల్లో ర్యాలీలు, 2,3న రిలే నిరహారదీక్ష, 8న విజయవాడలో విద్యుత్ సౌధలో ధర్నా, 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు వివరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

చిత్తూరు అర్బన్: నగరంలో జరుగుతున్న సుందరీకరణ పనులను మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ బుధవారం పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండు రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన వనం, పచ్చదనం పరిరక్షణ కోసం ఏర్పాటు చేస్తున్న గ్రిల్స్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రిల్స్ ఏర్పాటు పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పనులు వేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. అనంతరం ఏఎస్ఎం కాంప్లెక్స్‌లో పారిశుధ్య పనుల నిర్వహణను తనిఖీ చేశారు. కాంప్లెక్స్ ఆవరణలో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. కాంప్లెక్స్ పరిధిలో మరుగుదొడ్ల నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించి ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులతో చర్చించారు. గాంధీ విగ్రహం సర్కిల్ నుంచి భాస్కర హోటల్ వరకు ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ రోడ్ పనులను పరిశీలించారు. స్మార్ట్ రోడ్డు పనుల్లో భాగంగా రోడ్డు వెడల్పు, ఇతర పనులపై ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. కమిషనర్ వెంట ఎంఈ వెంకట ప్రసాద్, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, డీఈ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు ఉన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి

నగరంలోని జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని చిత్తూరు మేయర్ అముద ఆదేశించారు. నగరంలోని అనుప్పల్లె జగనన్న కాలనీలో బుధవారం ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. లబ్ధిదారులకు వీలైనంత త్వరగా ఇళ్లను అప్పగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. మేయర్ వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్‌బీఐ లోకేష్‌రెడ్డి, కార్పొరేషన్ అధికారులు ఉన్నారు.





పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ, అనుప్పల్లెలో ఇళ్లను పరిశీలిస్తున్న మేయర్ అముద

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



తవణంపల్లె: విద్యార్థులకు నోట్‌బుక్స్, విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఈఓ హేమలత

తవణంపల్లె: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ఎంఈఓ హేమలత తెలిపారు. మండలంలోని పొన్నేడుపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ కన్న మండడి మనువడు రాజకుమార్ ఇటీవల మృతి చెందాడు. అతని జ్ఞాపకార్థం రాజకుమార్ ట్రస్టు ద్వారా దిగువమోదలపల్లె పంచాయతీలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు అతని తల్లిదండ్రులు నోట్‌బుక్స్, విద్యాసామగ్రిని బుధవారం ఎంఈఓ హేమలత చేతులమీదుగా పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ దాతల సహకారం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, దాత యాగమూర్తియాదవ్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్య అందివాలి

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోర్సు డైరెక్టర్ ప్రకాష్ బాబు తెలిపారు. తవణంపల్లె హైస్కూల్లో హిందీ, ఫిజికల్ సైన్స్ పాఠ్యాంశాల బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎస్సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి అకడమిక్ క్యాలెండర్ యొక్క ఆవశ్యకతను ఉపాధ్యాయులకు వివరించారు. శిక్షణా కార్యక్రమంలో స్థానిక హైస్కూల్ హెచ్ఎం శ్రీరంజని, రిసోర్స్ పర్సన్లు లవకుమార్, సుధ, హసీన్, రెడ్డిలత పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

ఐరాల: విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేలా ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈఓ దామోదర్‌నాయుడు తెలిపారు. మండలంలోని కాణిపాకం జెడ్పీ హైస్కూల్లో బుధవారం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఇంగ్లిషు, సోషల్ సబ్జెక్టులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆంగ్లం అలవాటు చేయాలని చెప్పారు. బడి బయట పిల్లలుంటే వెంటనే వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేర్పించాలని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ కోర్స్ డైరెక్టర్, ఎం.పైపల్లె ఉన్నత పాఠశాల హెచ్ఎం అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల తనిఖీ

యాదమరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన యాదమరి ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహిస్తున్న సీఆర్సీ సమావేశాల శిక్షణ తరగతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. శిక్షణ తరువాత ఉపాధ్యాయులు తరగతి గదుల్లో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలు బోధించి మంచి ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏంఈఓ రుక్మిణీ, పాఠశాల హెచ్ఎం గిరిరాజ తదితరులు పాల్గొన్నారు.